క్లుప్తంగా

21న ఉచిత కంటి వైద్యశిబిరం

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కోటా రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైద్యశిబిరం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కంటి సమస్యలు పరిశీలించి అవసరమైతే శుక్లాల ఆపరేషన్ కూడా ఉచితంగా నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు మెగా వైద్య శిబిరం

పిడుగురాళ్ల: ఉన్నం చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పట్టణంలోని శ్రీనివాస్ కాలనీలోని పార్కు స్కూల్‌లో సాయంత్రం 4 గంటలకు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. ఆ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజుపాలెం: అనుపాలెం జెడ్పీ పాఠశాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు దుర్గి అమూల్య డిమాండ్ చేశారు. మండలంలోని అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలను ఎస్ఎఫ్ఐ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని హెచ్ఎం శైలజకు అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మణికంఠరెడ్డి, వెంకటరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

సత్తెనపల్లి: వృద్ధుడు అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన 62 ఏళ్ల వృద్ధుడు చెరుకూరి రాజశేఖర్ ఈ నెల 25న రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా సమాచారం లభించలేదు. ఆయన భార్య చెరుకూరి సుధ గురువారం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిస్తే సత్తెనపల్లి రూరల్ సీఐ 9440796231, సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ 08641-232033 నంబర్లలో తెలపాలని సూచించారు.

పోషకాహార ఉత్పత్తుల ప్రదర్శన



పిడుగురాళ్ల: ఐసీడీఎస్ పరిధిలో 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవంలో భాగంగా గురువారం పిడుగురాళ్ల మార్కెట్‌యార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఫుడ్‌స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే పిడుగురాళ్ల పట్టణ పరిధిలో పనిచేసే అంగన్‌వాడీ టీచర్లు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన వంటకాలు తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ యూనిట్ సీడీపీఓ పి.రాజేశ్వరితోపాటు సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కోటేశ్వరి, పీహెచ్‌సీ వైద్యురాలు రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలు రకాల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడీ సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజనబృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దేవస్థానం చైర్మన్ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు
- పిడుగురాళ్ల చేరుకున్న యూటీఎఫ్ రణభేరి ర్యాలీ
- భారీగా పాల్గొన్న ఉపాధ్యాయులు



పిడుగురాళ్ల రణభేరి ర్యాలీలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

పిడుగురాళ్ల: విద్య, ఆర్థిక రంగ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ చేపట్టిన రణభేరి కార్యక్రమం ర్యాలీ గురువారం పిడుగురాళ్ల పట్టణానికి చేరుకున్న సందర్భంగా అభినందన సభను పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో నిర్వహించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రావుల తోపాటు రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు పి.ప్రేమ్‌కుమార్‌లు రణభేరి ఆవశ్యకతను ఈ సమావేశంలో వివరించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకే రణభేరి చేపట్టటం జరిగిందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ రణభేరి ర్యాలీ ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు దశలుగా పర్యటించి ఉపాధ్యాయులను ఉద్యమానికి సిద్ధం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సెప్టెంబర్ 25న విజయవాడలో జరిగే బహిరంగ సభకు వేలాది మంది ఉపాధ్యాయులు హాజరయ్యేలా కార్యక్రమం రూపొందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వటం ద్వారా ఈ రణభేరి మోగించటానికి యూటీఎఫ్ నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, కారంపూడి, దుర్గి, మాచర్ల, గురజాల, రెంటచింతల మండలాల్లోని యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా నవరాత్రి ఏర్పాట్లు ప్రారంభం



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. గురువారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్వతి దేవి అమ్మవారి అంశలో జన్మించిన ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి అమ్మవారి దసరా నవరాత్రుల ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆర్యవైశ్యులందరూ సహకరించాలన్నారు. శ్రీ వాసవి అమ్మవారు సెప్టెంబర్ 22న బాల త్రిపురసుందరీ దేవిగా, 23 గాయత్రి దేవి, 24 మహా చండీ దేవి, 25 లలితా పరమేశ్వరి దేవి, 26 ధనలక్ష్మీ దేవి, 27 సంతాన లక్ష్మీ దేవి, 28 అన్నపూర్ణా దేవి, 29 సరస్వతీ దేవి, 30 దుర్గా దేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దిని దేవి, విజయదశమి రోజు 2న శ్రీ రజత కవచదారిణి దేవి అలంకారంలో భక్తులకు దర్శమిస్తారన్నారు. అమ్మవారికి 11 రోజులు అలంకారాలకు సంబంధించిన చీరలను, అష్టదేవతలకు వస్త్రాలను కట్టమూరి శ్రీనివాస శంకర్‌రావు, వెంకట భారతి, వంశీకృష్ణ, పావని దంపతులు సమర్పించనున్నట్లు తెలిపారు. విజయదశమి రోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి 'స్వస్థ్ నారి' వైద్య శిబిరాలు



మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మధు

దాచేపల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నడికుడి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మధు చెప్పారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందికి వైద్య శిబిరాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈనెల 20వ తేదీ నుంచి 29 వరకు ఉచిత వైద్య శిబిరాలు అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామని, ఈ వైద్య శిబిరాల్లో మహిళలందరికి బీపీ, షుగర్, నోటి, గర్భాశయ ముఖద్వార, బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు, కంటి పరీక్షలు, క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు మరియు ఇతర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరాల ఏర్పాటుపై మండలంలోని ఆరోగ్య సిబ్బందికీ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వైద్యాధికారి సహిన్ సుల్తానా మాట్లాడుతూ... మండలంలోని ప్రజలందరూ ఈ ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని, తొలుత సెప్టెంబర్ 20న దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభిస్తామని చెప్పారు. ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి, హెల్త్ ఎడ్యుకేటర్ మైత్రి, హెల్త్ సూపర్‌వైజర్లు సరస్వతి, లక్ష్మయ్య, మేరీ కుమారి, లలిత కుమారి, అంగన్‌వాడీ, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్



సత్తెనపల్లిలో స్వచ్ఛ ఉత్సవ్‌ర్యాలీ

సత్తెనపల్లి: పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, పట్టణాన్ని స్వచ్ఛ సత్తెనపల్లిగా తీర్చిదిద్దడానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ -2025 నినాదంతో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయం నుంచి గార్లపాడు రోడ్, గాంధీ బొమ్మల రోడ్, రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా తాలూకా సెంటర్ వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దని, సింగిల్ యూజ్డ్ పాలిథిన్ (కవర్లు) నిషేధించడంతో చిన్న, పెద్ద వ్యాపారస్తులు, ప్రజలందరూ వాటిని ఉపయోగించకూడదన్నారు. దీనిపై మైక్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటరీ మేస్త్రీలు, మెప్మా టీఎంసీ, సీఓలు, స్వయం సహాయక సంఘ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: ముప్పాళ్ళలో స్వచ్ఛత హి సేవ అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఎంపీడీవో కార్యాలయం నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ చేశారు. ఎంపీడీవో రత్నం మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని చెప్పారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావు, ఏపీఓ ఏడుకొండలు, ఎమ్మార్సీ బ్రహ్మానందం, పీడీ సుభాని పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం



గురజాల: తెలుగు బాప్టిస్టు చర్చి 70వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెవ డాక్టర్ రావెళ్ల జీవకుమార్, ఆచార్య రెవ డాక్టర్ బొనిగళ్ల జ్ఞాన మనోహర్‌లు పాల్గొని, స్తూపాన్ని ఆవిష్కరించారు. సంఘ కాపరి నవజీవన్ బాబు, జ్యోష్ణ జీవన్‌లు సంఘం అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ముగ్గు పేకాట రాయుళ్లు అరెస్టు

యడ్లపాడు: పంటపొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని లింగారావుపాలెం గ్రామ శివారున పొలాల్లో పేకాట ఆడుతున్నారంటూ అందిన సమాచారంతో ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బందితో స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న రూ.3700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కోడిపందేల ముఠా పట్టివేత

చిలకలూరిపేటటౌన్: కోడిపందేల నిర్వహణ స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గోవిందాపురం గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు బుధవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కోడి పందేలను నిర్వహిస్తున్న ప్రాంతంపై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.8,500 నగదు, 3 కోడిపుంజులు (ఒకటి చనిపోయింది), 11 బైకులను స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ విఆర్వో వీరవల్లి నాగ సంతోష లక్ష్మి విధులు ముగించుకొని తిరిగి బైకుపై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు మేరకు ఈనెల 17న సాయంత్రం రేషన్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేసి రెవెన్యూ కార్యాలయానికి మరొకరి బైకుపై వస్తుండగా మార్గమధ్యంలో శావల్యాపురం జాతీయ రహదారి మార్గంలో బైకు అదుపు తప్పి పడిపోయింది. ఈప్రమాదంలో వీఆర్వో నాగలక్ష్మికి తలకు, భుజంపై బలమైన గాయాలైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు తహసీల్దారు యం.అర్జున్‌నాయక్ తెలిపారు. నరసరావుపేట ఆర్డీవో కె.మధులత వైద్యుడితో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు సుబ్బారావు, ఆర్ఐ చంద్రబాబు, వీఆర్వోలు ఉప్పుటూరి చిన మంగయ్య, మల్లెల రాధ, దూపాటి దేవమ్మ, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్లు, లెక్చరర్లు

సత్తెనపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని విద్యాకేంద్రం జూనియర్ కాలేజ్ అండ్ డిగ్రీ కాలేజ్ డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకట్రావు చెప్పారు. పట్టణంలోని విద్యా కేంద్రం జూనియర్ కాలేజ్ ఆధ్వర్యాన సత్తెనపల్లి మండలం నందిగామ జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ -19 ఫుట్‌బాల్, సెపక్‌తక్రా ఎంపికల్లో విద్యాకేంద్రం జూనియర్ కాలేజీకి సంబంధించిన క్రీడాకారులు 11 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గురువారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇప్పుడు ఏ విధంగా అయితే ఎంపికయ్యారో ఈనెల 22 నుంచి 24 వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించి విజయం సాధించాలని ఖ్యాతిగడించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలవాలని కొనియాడారు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ అండర్ - 19 బాలుర జట్టుకు ఎంపికైన పి.నాగ సాయి, కె.బన్ను, పి.నవీన్, పి.తేజ, షేక్ సోహెల్ తన్వీర్, షేక్ మహమ్మద్ ఇర్ఫాన్‌ను అభినందించారు. ఫుట్‌బాల్ అండర్ -19 బాలికల జట్టుకు ఎంపికైన జి.సౌజన్య, డి.ప్రవల్లిక, కె.స్నేహలత, సెపక్ తక్రా అండర్ -19 బాలుర జట్టుకు ఎంపికైన వై.ప్రభుదాసు, పి.నవీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిమ్మగడ్డ చిట్టిబాబు, నంబూరి నరసింహారావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ మౌలాలి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎమ్.శ్రీనివాసరావు, పీడీ పుచ్చకాయల శివరామకృష్ణ ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

'ముప్పాళ్ల'లో మూడో విడత రీ సర్వే

డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ్‌కుమార్



గోళ్లపాడు గ్రామ సచివాలయంలో రీసర్వేపై సమీక్షిస్తున్న అధికారులు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలో మూడో విడత రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల గుర్తింపు జరుగుతున్నట్లు డివిజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ విజయ్‌కుమార్ చెప్పారు. గోళ్ళపాడులో రెండో విడతలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై సర్వే సిబ్బందితో గురువారం సమీక్షించారు. రీసర్వేలో భాగంగా ప్రస్తుతం రైతులకు అభ్యంతరాలపై నోటీసులు అందించామని చెప్పారు.1,050 మంది రైతులు భూముల రికార్డులను సర్వే సిబ్బందికి అందించారని, మిగిలిన వారి నుంచి భూముల కొలతలపై అభ్యంతరాలుంటే తెలియజేయవచ్చన్నారు. ఇప్పటి వరకు పూర్తైన సర్వే రికార్డుల వివరాలను పరిశీలించారు.
మండలంలో మిగిలిన తొండపి, ముప్పాళ్ళ, దమ్మాలపాడు, మాదల గ్రామాల్లోను మూడో విడత రీసర్వే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఆయా గ్రామాల్లో హద్దులను గుర్తించామని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. గోళ్ళపాడులో పట్టా సబ్‌డివిజన్ కోసం రైతు అందించిన అర్జీని పరిశీలించారు. మండల సర్వేయర్ ఎం.రాజు, వీఆర్వో బి.దాసు, విలేజ్ సర్వేయర్ నాగుల్‌మీరా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

పిడుగురాళ్ల: మున్సిపల్ వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జూలై నెలలో సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, వేతనాలు పెంచాలని, ఆప్కాస్ కొనసాగించాలని, 17 రోజుల సమ్మె కాలపు వేతనాలు అమలు చేయాలని, మరణించిన లేదా రిటైర్ అయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తదితర హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులు దేవళ్ల చిన్న వెంకటేశ్వర్లు, బత్తుల పార్వతి, ఎదురు లక్ష్మి, బత్తుల వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మందా రాజశేఖర్ దంపతులను సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకులు

దాచేపల్లి: ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం జరిగింది. నారాయణపురంలోని సీపీఐ కల్యాణ మండపంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు మందా రాజశేఖర్, పావులూరి వాణిశ్రీ దంపతులను శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇటీవల డీఎస్సీ లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనిశెట్టి అరుణని కూడా సన్మానించారు. ఎస్టీయూ దాచేపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆత్మీయ సన్మాన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జోసఫ్ సుధీర్ మాట్లాడుతూ... ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని, ఎస్టీయూ ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. సన్మాన గ్రహీత రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకోవడం తన బాధ్యతను మరింతగా పెంచిందని చెప్పారు. ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రామిరెడ్డి, నాయకులు సోము వెంకట రమణ, చెట్టిపోగు ఏసురత్నం, చెట్టిపోగు రాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు బైక్ చోరీ



ద్విచక్రవాహనం వద్ద ఆగంతకుడు

నరసరావుపేట టౌన్: నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో ఇంటి ఎదుట పార్క్ చేసి ఉన్న వాహనాన్ని క్షణాల్లో అపహరించిన ఉదంతం వాహన యజమానులను కలవరపాటుకు గురిచేస్తుంది. గురువారం పట్టపగలు పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో చోటు చేసుకున్న బైక్ చోరీ ఉదంతం వాహనాలకు రక్షణ కరువైందంటానికి నిదర్శనంగా నిలుస్తోంది. వివరాల్లో కెళ్లితే.. పాతూరులో నివాసం ఉండే షేక్ ఖాశిం ర్యాపిడో బైక్ ట్యాక్సీ నడుపుతూ జీవనం కొనసాగిస్తుంటాడు. గురువారం మధ్యాహ్నం తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో అజ్ఞాత యువకుడు అక్కడికి వచ్చి అటు ఇటు కొద్ది సేపు తచ్చట్లాడాడు. జనసంచారం తక్కువగా ఉన్న సమయం చూసి మారుతాళాలతో ద్విచక్ర వాహనాన్ని చాకచక్యంగా స్టార్ట్ చేసి క్షణాల్లో దొంగిలించుకొని వెళ్లాడు. ఈ తతంగం అంతా సమీపంలోని ఇంటి వద్ద ఉన్న సీసీ పుటేజ్‌లో నిక్షిప్తమైంది. సీసీ పుటేజ్‌ని సేకరించిన వాహన యజమాని టూటౌన్ పోలీసులను ఆశ్రయించి వాహన చోరీపై ఫిర్యాదు చేశాడు. ఇది ఇలా ఉండగా పట్టణంలో కొన్ని నెలలుగా ద్విచక్ర వాహన చోరీలు అధికమయ్యాయి. రాత్రి ఇంటి ఎదుట నిలిపిన వాహనం తెల్లవారేటప్పటికి అపహరణకు గురికావటం పరిపాటిగా మారింది. పోలీసులు సత్వర రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాకు గుర్రం జాషువా పేరు పెట్టాలి

వినుకొండ: తెలుగుసాహిత్యాన్ని సామాజిక చైతన్యం వైపు నడిపించిన విశ్వకవి గుర్రం జాషువా పేరును పల్నాడు జిల్లాకు పెట్టాలని గుర్రం జాషువా గుంటూ రు, పల్నాడు జిల్లా సాధన సమితి కన్వీనర్ అట్లూరి విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాషువా ఒక ప్రాంతానికో, ఒక రాష్ట్రానికో పరిమితమైన కవి కాదని, దేశం గర్వించదగ్గర జాతీయ కవీశ్వరుడని అన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

నూజెండ్ల: పరిశుభ్రత అనేది పౌరుల ఉమ్మడి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీ పాఠశాలలో స్వచ్ఛతా పట్వాడా కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి, సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక సహకారం

నరసరావుపేట రూరల్: ఉద్యాన రైతులకు సాంకేతిక సహకారం అందించేందుకు ఫార్మర్ చాట్ అప్లికేషన్ ఉపయోగపడుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. ఉద్యాన శాఖ, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్, మైక్రో సాఫ్ట్ భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చిన ఫార్మర్ చాట్ మొబైల్ అప్లికేషన్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకట్రావు పాల్గొని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి మస్తాన్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

వి.రెడ్డిపాలెంలో పోషక మాసోత్సవాలు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. పోషణ మాసోత్సవాల్లో ఊబకాయం గురించి వైద్యులు తెలియజేశారు. పంచదార వాడకం తగ్గించాలన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు చేయాలన్నారు. జంక్ ఫుడ్, తీపి పదార్థాలు, శీతలపానీయాలు ఇవ్వకూడదన్నారు. టీవీవి, మొబైల్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవతి, డాక్టర్ ప్రసన్న కుమార్, హెల్త్ సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

నూజెండ్ల: గ్రామాల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణతోనే స్వచ్ఛ గ్రామాలుగా రూపుదిద్దుకుంటాయని ఎంపిడివో పి.ఉమాదేవి అన్నారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వతేదీ వరకూ మండలంలోని 27 పంచాయితీల్లో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన నూజండ్లలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో గురువారం ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, ఏపీయం ఆంజనేయరాజు, సాక్షరభారత్ మండల కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, పంచాయతీ సెక్రటరీ లాలు, లగడపాటి సూరిబాబు పాల్గొన్నారు.